
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
సోమవారం 22 సెప్టెంబరు 2025





ఒక్కేసి పువ్వేసి.. చందమామ

- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు

సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. మహిళలు తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, ఇలా తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఒక్క చోటుకి చేర్చారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..., ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు ప్రసాదాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ వేడుకలతో జిల్లాలో పూల జాతర నెలకొంది.

- ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21


కడ్తాలలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు


యాచారం : మేడిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ఆమనగల్లులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

నెరవేరనున్న సీఎం హామీ

- పాఠశాల నిర్మాణానికి నేడు భూమి పూజ

షాద్‌నగర్ రూరల్/చౌదరిగూడ, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ చేయనున్నారు. ఈ పాఠశాల 150 వసంతాల వేడుకకు (జనవరి 30న) సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా హాజరయ్యారు. ఆ సమయంలో గ్రామాభివృద్ధికి ఆయన రూ. 18 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో పాఠశాల పునర్నిర్మాణానికి రూ.10కోట్లు అందజేస్తామని చెప్పారు. స్కూల్ నిర్మాణానికి టెండర్లు కూడా పూర్తయ్యాయి. దీంతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. తిరిగి పాఠశాలకు పూర్వ వైభవం రానుందని గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల పాఠశాల భవన నిర్మాణానికి, కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరవుతున్నట్లు మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదివారం అమావాస్య అని
మృతదేహం అడ్డగింత
పోలీసుల జోక్యంతో తండాలో ఖననం 7

నిత్య కృషితో క్రీడల్లో రాణింపు 7
ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఈసారి.. కొందరికే!

మహిళా సంఘాల సభ్యులకే బతుకమ్మ చీరలు

గతంలో మాదిరిగానే బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. గత ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన యువతులకు, మహిళలకు చీరలను పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి మహిళలకు చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. కానీ.. ఈ సారి మహిళలందరికీ కాకుండా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే బతుకమ్మ చీరలను అందించాలని సర్కార్ నిర్ణయించింది. ప్రతీ మహిళకు బతుకమ్మ చీరను అందివ్వాలన్న డిమాండ్ వస్తుంది. ఇప్పటికే జిల్లాలోని సర్దార్‌నగర్, కందుకూరు గోడౌన్‌లోకి చీరలు చేరుకున్నాయి. త్వరలోనే చీరలను పంపిణీ చేసేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.


కందుకూరు గోడౌన్‌లోకి డంప్ చేసిన బతుకమ్మ చీరలు

జిల్లాలో సంఘాలు	19,353
సభ్యులు	2,07,091
వీవోలు	788
మండల సమాఖ్యలు	21
జిల్లా సమాఖ్య	01
18 ఏళ్లు నిండిన మహిళలు (ఎస్‌హెచ్‌జీ-డీఆర్‌డీఏ)	2,07,091
జిల్లాకు వచ్చిన చీరలు	1,55,000

2,07,091 మంది సభ్యులకు లబ్ధి

- పంపిణీకి శరవేగంగా ఏర్పాట్లు
- కందుకూరు, సర్దార్‌నగర్ గోడౌన్‌లకు చేరుకున్న 1.55 లక్షల చీరలు

చీరలు వచ్చాయి



బతుకమ్మ చీరలు జిల్లాకు వచ్చాయి. జిల్లాలోని కందుకూరు, సర్దార్‌నగర్ గోదాంలోకి చీరలు చేరాయి. 1,55,000 చీరలు గోడౌన్‌లో భద్రపర్చాం. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే పంపిణీ చేస్తాం.

శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆడపడుచులు ఇష్టంగా నిర్వహించుకునే వేడుక బతుకమ్మ. ఎంతో చరిత్ర కలిగిన బతుకమ్మ పండగకు కానుకగా మహిళలకు చీరలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో రేషన్ కార్డుల ఆధారంగా చీరలు పంపిణీ చేయగా.. ఈసారి కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులకు మాత్రమే ఈ చీరలను అందించాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే మహిళా సంఘాల సభ్యుల సంఖ్యను లెక్కించారు. వీరందరికీ చీరలు పంపిణీ చేయనున్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేయనున్నారు. రెండు రకాల సైజుల్లో 6.5 మీటర్లు, 9 మీటర్ల చీరలు అందుబాటులో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి

మిగతా 8వ పేజీలో...


విజేతలతో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ఆత్మరక్షణకు కరాటే దోహదం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని మణిగార్డెన్‌లో ఆదివారం డీఎస్ఎస్‌కేఏ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో షోటోఖాన్ సౌత్ ఇండియా స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఆయన గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఆయన అభిప్రాయపడ్డారు. కరాటేతో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్గారి వైభవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దండు రాంమోహన్, వీరేందర్, లోకేష్, కరాటే మాస్టర్ కుశాల్ తదితరులు ఉన్నారు.

రోజూ అవే కష్టాలు!

- యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు


టోకెన్ల కోసం ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

కేశంపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. పీఏసీఎస్ వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, కొత్తపేట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేపట్టారు. అయితే 450 బస్తాల యూరియా వస్తే దాదాపు 500 మంది రైతులు వచ్చారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న సీఐ నరహరి కేంద్రం వద్దకు చేరుకుని యూరియా సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు. యూరియా అయిపోవడంతో టోకెన్లు ఇవ్వాలని ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్‌ను మహిళ రైతులు చుట్టుముట్టారు. దీంతో వారికి టోకెన్లు ఇవ్వడంతో శాంతించారు.

బీసీలపై ప్రభుత్వానిది సవతి ప్రేమ

- 42శాతం రిజర్వేషన్ కల్పించడంలో రెండు నాలుకల ధోరణి
- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

కందుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై నిజమైన ప్రేమలేదని, తమను రాజకీయంగా వాడుకోవడానికే ప్రయత్నిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య అన్నారు. ఆదివారం కందుకూరులో ఆ సంఘం నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ, రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని కందుకూరు, మహేశ్వరం సహకార సంఘాల చైర్మన్‌లుగా ఉన్న బీసీ బిడ్డలు డి.చంద్రశేఖర్, పాండు యాదవ్‌లను రాజకీయ దురుద్దేశంతోనే పదవి నుంచి తొలగించారన్నారు. బీసీలను తొలగించి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి పదవులు అప్పగించడంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆంతర్యం ఏమిటో బయటపడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని, రెండు మండలాలలో బీసీలకు జరిగిన అన్యాయంపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు అచ్చన్న పాండు కురుమ, నాయకులు బండ ఆంజనేయులు, ఇంద్రకంటి రవీందర్‌గౌడ్, బి.రవి, శ్రీరాములు, బి.మల్లేష్, జి.అంజయ్య, పాముల కృష్ణ, సీహెచ్.శ్రీకాంత్, అనిల్, డిల్లీ గణేష్, ఆర్.రవీందర్ పాల్గొన్నారు.


లాల్‌పహాడ్‌లో బస్ షెల్టర్ లేక రోడ్డుపై నిల్చున్న విద్యార్థులు(ఫైల్)

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ!

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

- హోటల్స్, కిరాణా షాపులే అడ్డాలు
- గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- విద్యార్థులు, ప్రజల తిప్పలు తీరేదెప్పుడో?

చౌదరిగూడ, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ఎండ, వానలో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల రాక కోసం విద్యార్థులు రోడ్డుపై నిలబడాల్సి వస్తుంది. హోటల్స్, కిరాణం షాపుల ఎదుట నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని

మిగతా 8వ పేజీలో...

రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తోంది



బస్ షెల్టర్ లేకపోవడంతో గంటల తరబడి రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తుంది. వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్నాం. కనీసం కూర్చుందామన్నా నిలువ నీడ లేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం బస్ షెల్టర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలి.

- వడ్ల బుచ్చయ్య, ప్రయాణికుడు

బస్‌షెల్టర్ నిర్మించాలి



నిత్యం లాల్‌పహాడ్‌కు అనేక మంది చౌరస్తాకు వస్తుంటారు. బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఎండ, వానలో రోడ్డు పక్కన నిలబడాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ నిర్మించాలి.

ముదసీర్, విద్యార్థి

పట్నంలో భారీ వర్షం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలో ఆదివారం సాయంత్రం 5.45 నుంచి రెండు గంటలపాటు భారీగా వర్షం కురిసింది. వర్షంతో రోడ్లన్నీ జలమయమైనాయి. ఇబ్రహీంపట్నం టౌన్ సహా పలు గ్రామాల్లో ఎంగిలపూల బతుకమ్మ ఆటకు బ్రేక్ పడింది. కనీసం ఇళ్ల నుంచి మహిళలు బయటకు రాలేకపోయారు. టౌన్‌లోని బృందావన్ కాలనీ, త్రిశక్తి కాలనీలో వర్షం కురిసినంతసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయి కారు చీకట్లు అలుముకున్నాయి.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

రంగారెడ్డి అర్బన్/యాచారం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని, వారి సంక్షేమానికి ప్రభుత్వాల సహకారం అవసరం చాలా ఉందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని శ్రీనగర్‌కాలనీలో తన నివాసంలో జిల్లా జర్నలిస్టుల ఆహ్వాన కమిటీ చైర్మన్ సురేష్, జిల్లా కార్యదర్శి షైల సైదులుతో కలిసి మూడవ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ చారి, కోశాధికారి ఎన్.శ్రీ శైలం, ఉపాధ్యక్షులు గణేష్ తదితరులున్నారు.

అలైన్మెంట్ మార్చే వరకు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు, చిన్నారులు

కడ్తాల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పొలాల మీదుగా తలపెట్టిన 765కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను నిలిపేసి అలైన్‌మెంట్‌ను మార్చాలని కడ్తాలలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 14వ రోజుకు చేరాయి. విద్యుత్ టవర్ల నిర్మాణాన్ని ఆపాలని భూ నిర్వాసితులు చేస్తున్న రిలే దీక్షలకు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా హైటెన్షన్ లైన్ నిర్మించడం సరికాదన్నారు. కొందరు పారిశ్రామికవేత్తల ఒత్తిళ్లతోనే అలైన్మెంట్ మార్చి కడ్తాల మీదుగా వేస్తున్నారని మండిపడ్డారు. టవర్ల ప్రతిపాదిత ప్రాంతాల భూములన్నీ సన్న, చిన్నకారు రైతులవేనని తెలిపారు. తమ భూములను కాపాడుకునేందుకు ఎంతదాకైనా పోరాడతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుల కుటుంబ సభ్యులు, నాయకులు రామకృష్ణ, సాకేత్, చాణక్య, కె.రాములుగౌడ్, కె.కేశవగౌడ్, సహర్ష్, నిహాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌కు భూములు సేకరిస్తే పేదలకు నష్టం



అయ్యవారిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేద రైతుల భూముల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వేస్తే రైతులు ఉపాధి కోల్పోయి నష్టపోతారని, ముందు నిర్ణయించిన ప్రకారమే ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు అన్నారు. ఫరూక్‌నగర్ మండలం అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ, చించోడు, భీమారం గ్రామాలను ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పొలాల నుంచి రోడ్డు వేయొద్దని డిమాండ్ చేశారు. గతంలో మార్కింగ్ చేసినట్టే నిర్మించాలని తెలిపారు. గతంలో 472 సర్వే నంబర్ల నుంచి రోడ్డును ప్రతిపాదించారని గుర్తుచేశారు. ఇప్పుడేమో 486 మొదలుకొని 689 వరకు సర్వే నంబర్ల భూముల్లో రోడ్డు వేస్తామని చెప్పడం సరి కాదని అన్నారు. ఇలా రోడ్డు వేస్తే 300మంది రైతులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు 300 ఎకరాలు కోల్పోతారని తెలిపారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే నష్టం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సీపీఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీను, రైతులు సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, సాయన్న, సత్తయ్య, శ్రీధర్, యాదయ్య ఉన్నారు.

అభివృద్ధి పేరిట మనోభావాలను దెబ్బతీయొద్దు

కొడంగల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో కొందరి మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేయడం సరైంది కాదని ముస్లిం నాయకులన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, దుకాణాలను తొలగించడంతో పాటు ఓ వర్గానికి చెందిన మతపరమైన నిర్మాణాలను తొలగించడం తగదన్నారు. వారు ఆదివారం కొడంగల్‌లో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి రోడ్డుకు ఇరువైపులా మతపరమైన నిర్మాణాలను కూల్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పలువురు ముస్లిం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు.



కొడంగల్ చౌరస్తా వద్ద పహరాకాస్తున్న పోలీసులు

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో భారత విద్యార్థులకు భారం



డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు

చేవెళ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచడం భారత విద్యార్థులకు ఆర్థిక భారం అని బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడి నిర్ణయం తో ఐటీ నిపుణులు, ఇంజినీర్లు, వైద్యు లు వంటి వృత్తి రంగ నిపుణులు, పైచదువులు చదవాలనుకునే యువత ఆర్థిక భారంతో అమెరికా వెళ్లలేరని అన్నారు. ఉన్నత విద్య, ఉపాధి కోసం అమెరికా వెళ్లలేక వెనకడుగు వేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం భారత్-అమెరికా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు.

వీసా ఫీజు పెంపుతో రాష్ట్రంపై తీవ్ర ప్రభావం



ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హెచ్1-బీ వీసా ఫీజు రూ.88లక్షలకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారతీయుల అమెరికా కలలు చెదురుతాయని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు అన్నారు. వీసా ఫీజు పెంపుతో తెలంగాణ యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఆదివారం ఎంపీ మాట్లాడుతూ.. భారత్-అమెరికాల మధ్య దశాబ్దాలుగా ఉన్న సంబంధాలు ట్రంప్ నిర్ణయంతో దెబ్బతింటాయని, సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవచూపాలన్నారు.

ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ శాంతి అవార్డు



అవార్డు అందుకుంటున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి ఆదివారం గ్లోబల్ శాంతి అవార్డు-2025ను అందుకున్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ కార్యాలయంలో ఆది వా రం జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్లు జి.వేణుగోపాల్, బి.సూర్యలు జంగారెడ్డికి అవార్డును అందజేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. దెబ్బడగూడకు చెందిన జంగారెడ్డి విద్యార్థి దశ నుంచే విద్యార్థులు, యువకులను శాంతి మార్గంలో నడిపించి, దేశ సమైక్యత, అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. హింసామార్గంతో ఏమీ సాధించలేమని, కుల మతాలకు అతీతంగా శాంతి యుతంగా మెలగాలని పిలుపునిచ్చారు. నిత్యం శాంతిని బోధించే జంగారెడ్డికి ఈ అవార్డును ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధి శివకుమార్, అందుగుల సత్యనారాయణ, సౌడపు వెంకటేశ్‌గౌడ్, రాఖేశ్‌గౌడ్, బాబూరావు, మహేందర్, నరసిం హ, సురేందర్‌రెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి



షమీం (ఫైల్)

చౌదరిగూడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడు చౌదరిగూడలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. పెద్ద ఎల్కిచర్లకు చెందిన షమీం ఆదివారం మధ్యాహ్నం తన పొలం పనులు ముగించుకుని బైకుపై ఇంటికి వస్తున్న సమయంలో అతడిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో అతడు బైక్‌పై నుంచి పడిపోయాడు. తేనె టీగలను అతడిని శరీరం మొత్తం కుట్టాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. వాహనంలో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే షమీం మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. షమీం నందిగామ మండలంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది. షమీం భార్య ముజీబున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా వంతెన.. ఇబ్బందుల్లో ప్రజలు



నిర్మాణం పూర్తి కాని కాస్లాబాద్ వంతెన

మోమిన్‌పేట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని నందివాగు ప్రాజెక్టు కుడి కాల్వ నుంచి పొలాలకు నీరు వెళ్తుంది. గతంలో కుడి కాల్వపై వంతెన కుంగిపోవడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వంతెన నిర్మాణం పూర్తయినా ఇరువైపులా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టక బ్రిడ్జి వాడకంలో లేదు. దీంతో రైతులకు, గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వంతెన నిర్మించినా ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా జనరేటర్

● వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోని అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి పదేళ్ల క్రితం ప్రభుత్వం జనరేటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ జనరేటర్‌కు కనెక్షన్ సకాలంలో ఇవ్వలేదు. దానిలో ఏదో సమస్య తలెత్తిందని టెక్నీషియన్ అప్పట్లో అధికారులకు చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి జనరేటర్‌ను ఆన్ చేయించి వాడుకలోకి తెచ్చేందుకు అధికారులు పట్టించుకోలేదు. రూ.లక్షలు వెచ్చించి తెచ్చిన యంత్రం ఎండకు ఎండుతూ వానకు నానుతూ శిథిలావస్థకు చేరుతోంది. కార్యాలయంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది సౌకర్యార్థం తెచ్చిన జనరేటర్‌కు కనీసం షెడ్ అయినా వేయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. తెచ్చినప్పటి నుంచీ ఈ యత్రం నిరుపయోగంగానే ఉంటోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు కార్యాలయ అధికారులు, సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు మాత్రం తప్పడంలేదు. జనరేటర్‌ను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం బయట పదేళ్లుగా ఉంటున్న జనరేటర్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు

బంజారాలను ఎస్టీల్లోనే ఉంచాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కొందరు చేస్తున్న కుట్రలు తిప్పి కొట్టేందుకు బంజారా సమాజం ఉద్యమించాలని పలువురు గోర్‌వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులన్నారు. ఎస్టీ జాబితాలోంచి తొలగించాలని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించడాన్ని నిరసిస్తూ ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎఫ్‌సీ నగర్ నుంచి ఘట్‌కేసర్ అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీని కొనసాగింది. సంఘం నాయకులు మాట్లాడుతూ.. బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రలను ఎదుర్కొనేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో మోతీలాల్, నరేశ్, కిరణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సీఎస్ఐ చర్చిలో ఉమెన్స్ ఫెలోషిప్ వేడుక

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని ఎన్జీవో కాలనీ సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఆదివారం ఉమెన్స్ ఫెలోషిప్ వేడుకను నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలో మహిళల ప్రాధాన్యం గురించి వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీఎస్ఐ మహిళా ఫెలోషిప్ అధ్యక్షురాలు సబిత, మేడ్చల్ చర్చి అధ్యక్షురాలు దేవపాలమ్మ, కార్యదర్శి రజని పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బీటీ రోడ్డు పనులను చేపట్టాలి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మట్టి రోడ్డుపై నుంచి మొరాన్ని తరలిస్తున్న భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం అవుతోందని, ఆదివారం ఆ మార్గంలో వెళ్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు పనులకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు, ప్రజల ఇబ్బందులు

నిధుల్లేక.. పనులు కాక

● అసంపూర్తిగా జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్, గిరిజన భవన్ పనులు

● దశాబ్దాలుగా కాలేజీ భూ వివాదం ● పరిష్కరించని పాలకులు, అధికారులు



నిలిచిపోయిన ఇండిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. నిధులు విడుదల కాక కొన్ని, భూ వివాదాలతో మరికొన్ని పనులు కావడం లేదు. అసంపూర్తి భవనాల్లో కొన్ని మూగ జీవాలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మున్సిపాలిటీలో గతంలో చేపట్టిన కళాశాల భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, బంజారా భవన్‌ల నిర్మాణాలు మధ్యలో నిలిచాయి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులను పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



భూ వివాదంతో అసంపూర్తిగా నిలిచిన జూనియర్ కళాశాల భవన నిర్మాణం

ఇంటిగ్రేటెడ్ యార్డ్‌కు నిధుల గ్రహణం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌కు 2021లో ప్రభుత్వం రూ.4.5కోట్లు మంజూరు చేసింది. మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మాణానికి స్థలం కేటాయించి శంకుస్థాపన చేశారు. 2023లో పనులు ప్రారంభించి స్లాబ్‌ల వరకు నిర్మించారు. రూ.3.3కోట్ల పనులు చేయగా ప్రభుత్వం రూ.2.26కోట్లు చెల్లించింది. పనులకు రూ.1.04కోట్ల బిల్లు రాక కాంట్రాక్టర్ 20నెలల క్రితం పనులు నిలిపివేశాడు.

భూ వివాదంతో నిలిచిన కాలేజీ నిర్మాణం

ఆమనగల్లుకు 2001లో జూనియర్ కళాశాల మంజూరైంది. భవన నిర్మాణానికి 2004లో అప్పటి ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి దాతల సహకారంతో మాడ్గుల రోడ్డులో 9.15ఎకరాల కొనుగోలు చేయించి స్థలాన్ని గవర్నర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పట్లో కాలేజీ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు కాగా అప్పటి కేంద్ర మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి పనులు ప్రారంభించారు. కొద్ది రోజులకే కళాశాల స్థలంపై వివాదాలతో పనులు నిలిచాయి. 2022లో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కళాశాల స్థల వివాదంపై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి స్థల వివాదాన్ని పరిష్కరించి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేశారు. దీంతో 2022లో పనులు ప్రారంభమయ్యాయి. భవనాన్ని పూర్తి చేసేలా పనులు జరుగుతుండగా ఆ భూమిపై తమకు హక్కులున్నాయని కొందరు దళితులు కోర్టుకు వెళ్లడంతో 2023లో పనులు నిలిచాయి.

గిరిజన భవన్ పూర్తయ్యేదెన్నడో...

ఆమనగల్లులో తలపెట్టిన గిరిజన(బంజారా) భవన్ నిర్మాణానికి నిధులు లేక మధ్యలో నిలిచింది. 2023లో కల్వకుర్తి రోడ్డులో బంజారా భవనకు 30గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.2కోట్లు మంజూరు చేశారు. 2023 జూన్ 17న పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదైనా పనులు ప్రారంభంకాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో టెండర్లు నిర్వహించి 8నెలల క్రితం పనులు ప్రారంభించారు. గోడలు, షెడ్డు పనులు పూర్తి చేశారు. రూ.80 లక్షల పనులు చేసినా బిల్లులు రాక 6నెలల క్రితం కాంట్రాక్టర్ పనులను నిలిపేశాడు.



ఏడాదిగా ముందుకుసాగని గిరిజన భవన్ పనులు

నిధులు విడుదల చేయాలి



ఆమనగల్లులో బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మంజూరు చేసిన పనులకు నిధులు విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం పనులు పూర్తి చేయించి భవనాలను వినియోగంలోకి తేవాలి. ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకోవాలి. భూ వివాదాన్ని పరిష్కరించి కాలేజీ భవనాన్ని పూర్తి చేయాలి.

- కండె హరిప్రసాద్, మాజీ జెడ్పీటీసీ, ఆమనగల్లు

ప్రభుత్వానికి నివేదించాం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. మంజూరైన రూ.4.5 కోట్లకు అదనంగా మరో రూ.1.49 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. బిల్లుల రాక కాంట్రాక్టర్ పనులు చేయడంలేదు. సమస్య పరిష్కారానికి అధికారులకు వివరిస్తాం.

- శంకర్‌నాయక్, కమిషనర్, ఏఎంసీ, ఆమనగల్లు

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం



బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా పనులను ప్రారంభించింది. చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయలేదు. దాంతో చాలా పనులు మధ్యలో నిలిచిపోయాయి. జూనియర్ కళాశాల భవన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గిరిజన భవన్ పనుల పూర్తికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి చర్యలు చేపట్టారు. పనులు త్వరలో ప్రారంభించి పూర్తిచేయించి బిల్డింగ్‌లను వినియోగంలోకి తెస్తాం.

- యాట గీత, ఏఎంసీ చైర్‌పర్సన్, ఆమనగల్లు



ఆగమన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జీ



ఆగమన్ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అమ్మవార్ల ఆగమన్

ఆమనగల్లు/చేవెళ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆమనగల్లులోని గాంధీచౌక్ వద్ద ఆదివారం సాయంత్రం దుర్గాభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత ఆగమన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సామాజిక, సమరసత ప్రముఖ్ అప్పాల ప్రసాద్, బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి హాజరై ప్రసగించారు. నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. దుర్గమాత శక్తి ధైర్యానికి చిహ్నమని, యువత సంప్రదాయాలను కాపాడుతూ సమాజ సేవల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, నాయకులు సుండూరి శేఖర్, గోరెటి నర్సింహ, విక్రమ్ రెడ్డి, చెక్కాల లక్ష్మణ్, బి.దుర్గయ్య, శ్రీకాంత్ సింగ్, ఉత్సవ కమిటీ సభ్యులు మామిడిశెట్టి ప్రవీణ్, పాతకోట సిరి, బబ్లూ, జె.శివ, మధు, ధ్యాసం వంశీ, జనుంపల్లి నర్సింహ పాల్గొన్నారు. అలాగే చేవెళ్లలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రచ్చబండ దుర్గామాత అమ్మవారి ఆగమన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి వరకు ఊరేగింపు మధ్య అమ్మవారిని మండపానికి తీసుకువచ్చారు. చేవెళ్లతోపాటు ఆలూర్, మల్కాపూర్, గుండాల, అల్లావాడ, ఎన్కెపల్లి గ్రామాల్లో దుర్గమాతలను నెలకొల్పుతున్నారు.



చేవెళ్లలో దుర్గామాత ఆగమనంలో పాల్గొన్న భక్తులు



ఆమనగల్లులో దుర్గామాత విగ్రహం ప్రతిష్ఠించేందుకు సిద్ధమైన మండపం

శరన్నవరాత్రి ఉత్సవాలకు మండపాలు సిద్ధం

ఆమనగల్లు/చేవెళ్ల సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రోత్సవాలకు ఊరూవాడ ముస్తాబయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యే దుర్గామాత ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. మండపాలను శోభాయమానంగా రూపుదిద్దారు. దేవీ నవరాత్రోత్సవాలు, దసరా వేడుక నేపథ్యంలో గ్రామాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. అక్టోబరు 2వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు కొనసాగుతాయి.



ప్రత్యేక ఆకర్షణగా రూపుదిద్దుతున్న మండపం

లక్ష్మీవేంకటేశ్వరాలయంలో నిత్య పూజలు ఇలా...

ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, ఆలయ ఈవో టి.నరేందర్‌లు ఆదివారం మాట్లాడుతూ.. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టే పూజా కార్యక్రమాలను వివరించారు. 22న ఉదయం పంచామృతాభిషేకం, పుణ్యాహవచనం, దీపారాధన, సహస్ర దీపాలంకరణ, కలిశసేవ, 23న అభిషేకం, వేదపారాయణం, అర్చన, రాత్రి పల్లకి సేవ, 24న అభిషేకం, వేదపారయాణం, రాత్రి చంద్రప్రభ వాహనసేవ, 25న అభిషేకం, వేదపారయణం, రాత్రి రాత్రి 7గంటలకు హంస వాహన సేవ, 26న వేదపారాయణం, సింహవాహన సేవ, 27న అర్చన, రథోత్సవం, 28న అభిషేకం, రాత్రి శేషవాహనసేవ, 29న అభిషేకం, రాత్రి గజవాహన సేవ, 30 అభిషేకం, అర్చన, రాత్రి హనుమంత వాహన సేవ, అక్టోబరు 1న అభిషేకం, అర్చన,రాత్రి గరుడవావన సేవ, 2న అభిషేకం, వేదపారాయణం, అర్చన, విజయదశమి, మధ్యాహ్నం 3గంటలకు పుష్కరిణిలో స్వామి వారి చక్రతీర్థం(తెప్పోత్సవం), రాత్రి 8గంటలకు అశ్వవాహనసేవ, శమీపూజ తదితర కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతాయని తెలిపారు. భక్తులు తరలొచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.



చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరాలయం

ఆదివారం అమావాస్య అని మృతదేహం అడ్డగింత

» తండా వాసులకు నచ్చజెప్పిన పోలీసులు

» చివరకు తండాలో మృతదేహం ఖననం

కొత్తూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివారం అమవాస్య అని మృతదేహాన్ని తీసుకురావొద్దంటూ అడ్డుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూర్ మండల పరిధి మల్లాపూర్‌తండా గ్రామపంచాయతీలోని రాగ్యాతండాకు చెందిన విజయలక్ష్మి(33)కి మల్లాపూర్‌తండాకు చెందిన కిషన్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనోపాధి కోసం వారు శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జీవితం మీద విరక్తి చెందిన విజయలక్ష్మి రెండు రోజుల క్రితం క్రిమిసంహారక మందు సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబసభ్యులు మల్లాపూర్‌తండాకు తీసుకువచ్చారు. ఆదివారం అమవాస్య కావడంతో మృతదేహాన్ని తండాకు తీసుకరావద్దని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో తండాకు చేరుకున్నారు. తండావాసులకు సర్దిచెప్పారు. దీంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రామాంజపురంలో ఉన్న తమ సొంత భూమికి తరలించి అక్కడ ఖననం చేశారు.

సొంత డబ్బుతో రోడ్డు మరమ్మతులు



రోడ్డుపై మొరం పోసి చదును చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చౌడాపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు అధ్వానంగా మారడంతో బీఆర్ఎస్ నాయకులు సొంత డబ్బుతో మరమ్మతు చేయించారు. మండలంలోని జాకారం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు, ప్రజలు యాతన అనుభవిస్తున్నారు. దీంతో ఆదివారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు రోడ్డు గుంతల్లో మొరం పోయించి చదువును చేయించారు. ఇప్పటికైనా మండలంలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల నర్సిములు, కృష్ణయ్య, శివకుమార్, చందు, నరసింహ, ప్రవీణ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్య కృషితో క్రీడల్లో రాణింపు

» ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



శంషాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించడానికి నిరంతరం కృషిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని ఎస్‌కేఎస్ స్కేటింగ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మహబూబ్‌నగర్ రోలర్‌స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. ఏ క్రీడల్లోనైనా గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి ఉత్సవాలు

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీవారి రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతీ రోజు శ్రీవారి కల్యాణంతోపాటు నిత్యం ఒక వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దైవ దర్శనం చేసుకోవాలని కోరారు.

మిల్లు కట్టకున్నా బిల్లు

యాలాల ప్యాక్స్ ఘనత

» అప్పనంగా రూ.54లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లింపు

» ఏడాదిగా పనులు చేయని గుత్తేదారు

» ఫిర్యాదుకు సిద్ధమైన సొసైటీ

తాండూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు గోదాంలు, రైస్ మిల్లుల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. వాటితో సొసైటీలకు గోదాంలు, రైస్ మిల్లులు నిర్మించాలనేది లక్ష్యం. అయితే యాలాల సొసైటీలో కేవలం గోదాంలు నిర్మించారు. రైస్ మిల్లు నిర్మాణానికి ప్యాక్స్ పాలకవర్గం కాంట్రాక్టర్‌కు రూ.54లక్షల అడ్వాన్స్ చెల్లించింది. నాబార్డు అప్పును సొసైటీ కిస్తీల్లో చెల్లించాలి. కాగా మిల్ నిర్మించకుండానే మొదట కిస్తు కింద రూ.32లక్షలు ప్యాక్స్ చెల్లించింది. అయితే మిల్లు కట్టకుండా ఎంబీ రికార్డుకు ఇంజినీరింగ్ అధికారులు అంగీకరించలేదు. తనకు గోదాం కట్టిన బిల్లు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ మిల్ నిర్మించకుండా ఏడాదిగా పత్తాలేకుండా పోయాడు. దీంతో సొసైటీ పాలకవర్గంలో టెన్షన్ మొదలైంది. తాము ఎక్కడ ఇరుక్కుంటామేమోనని జంకుతున్నారు.



యాలాల పీఏసీఎస్ నిర్మించిన గోదాం

సొసైటీల్లో వసతుల కల్పనకు నాబార్డు నిధులు

రైతుల సౌకర్యార్థం సొసైటీల్లో గోదాంల నిర్మాణం, రైస్ మిల్లు ఏర్పాటుకు రూ.3కోట్ల చొప్పున నాబార్డు నిధులు మంజూరు చేసింది. తీర్మానాలతో పనులను ఆమోదించి కాంట్రాక్టర్లకు అప్పగించాలి. బషీరాబాద్, యలాల, తట్టెపల్లి, ఎల్మకన్నె సొసైటీలకు గాను బషీరాబాద్‌లో గోదాం, మిల్లు నిర్మించి ప్రారంభించారు. ఎల్మకన్నె, తట్టెపల్లిల్లో గోదాంలు నిర్మించారు. యాలాలలో గోదాం మాత్రం నిర్మించారు. దీనిని ఓ మిల్లర్ ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు ఇచ్చారు. మిల్లు నిర్మించుకుండానే ఏడాది క్రితం కాంట్రాక్టర్‌కు రూ.54లక్షలు చెల్లించారు. ఈ విషయంలో డీసీసీబీ అధికారులు ఎలాంటి విచారణ, పరిశీలన చేయకుండానే అప్రూవల్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌కు ఆర్థిక లబ్ధి చేకూర్చేలా అడ్వాన్స్ చెల్లించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై సొసైటీ సభ్యులు కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. డీసీసీబీ సైతం సదరు కాంట్రాక్టర్‌కు చెందిన కంపెనీకి నోటీసిచ్చింది. అయితే చెల్లింపు చెక్కులపై సొసైటీ చైర్మన్, కార్యదర్శిల సంతకాలున్నాయి. ఇప్పుడు తాము ఇరుక్కున్న సమస్య నుంచి బయటపడేందుకు బాధ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నుంచి డబ్బును రాబట్టేందుకు చూస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం



యాలాల సొసైటీలో గోదాం కట్టి రైస్ మిల్లు నిర్మించలేదు. పనులను వదిలేసిన కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఇందుకు కాంట్రాక్టర్‌కు వారం గడువిచ్చాం. అప్పటికీ పనులు చేపట్టకుంటే ఫిర్యాదు చేస్తాం. గోదాం నిర్మాణానికి సొసైటీ తీర్మానించింది. అయితే మిల్లు మిషనరీకి అడ్వాన్స్ చెల్లించాం.

- సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్, యాలాల

వెంటనే మిల్లు పనులు చేపట్టాలి



గోదాం, రైస్ మిల్ నిర్మాణానికి తీర్మానించి కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ చెల్లించారు. దీనికి సొసైటీ చైర్మన్, సీఈవోలే బాధ్యత వహించాలి. దీనిపై ప్రతీ సమావేశంలో ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదు. మిల్లు మిషనరీకని చెప్పి తీర్మానించి డబ్బు నేరుగా కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధం.

-రాములు, వైస్ చైర్మన్, యాలాల సొసైటీ

ఊరూవాడా బతుకమ్మ సంబురాలు


కేశంపేట మండలం నిర్దవెల్లిలో..


కడ్తాలలో..

జిల్లావ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆలయాల వద్దకు చేరుకున్నారు. బతుకమ్మ ఆట పాటలు అలరించాయి. రాత్రి ర్యాలీగా వెళ్ల చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


ఆమనగల్లులో నిర్వహించిన బతుకమ్మ వేడుకలో మహిళలు


కందుకూరు మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చేవెళ్ల : మండలంలోని పామెన గ్రామంలో బతుమ్మ ఆడుతున్న గ్రామస్తులు

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శంకర్‌పల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం మేరకు.. శంకర్‌పల్లి మున్సిపాలిటీ అయ్యప్పరెడ్డి కాలనీలో నివాసముండే కమ్మరి దశరథ్(38) కూలి పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి జీవనం సాగించేవాడు. ఈక్రమంలో కొన్నాళ్ల నుంచి కూలి పనులకు వెళ్లకుండా తాగుడుకు అలవాటు పడ్డాడు. శనివారం రాత్రి దశరథ్ మద్యం తాగి ఇంటికి రావడంతో కుటుంబికులు మందలించారు. దాంతో ఆయన ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబికులు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. తండ్రి చందూ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కాగా, మృతుడు దశరథ్‌కు భార్య రేణుక, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

గుడిసెను ఢీకొన్న ట్రాక్టర్

- తండ్రీ కుమారుడికి గాయాలు

చౌదరిగూడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ గుడిసెను ఢీకొనడంతో తండ్రీకుమారులకు గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లకు చెందిన రావిర్యాల జంగయ్య గుడిసెలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులు సాయంత్రం వంట చేసుకుంటుండగా.. గాలిగూడ గ్రామం నుంచి వస్తున్న ట్రాక్టర్ గుడిసెను ఢీకొంది. డ్రైవర్ చంద్రయ్య అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి గుడిసెను ఢీకొనడంతో లోపల ఉన్న జంగయ్యతో పాటు అతడి కుమారుడు ప్రణీత్‌లకు గాయాలయ్యాయి. ఈమేరకు ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి ఇద్దరిని గాయపరిచి, గుడిసెను డ్యామేజ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జంగయ్య మరో కుమారుడు సతీశ్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ట్రాక్టర్ యజమాని లాల్‌నాయక్, డ్రైవర్ చంద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎన్నిక ఏదైన కాంగ్రెస్‌దే విజయమన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఆదివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించారు. ఆయా మండలాల పరిధిలోని పలు చోట్ల అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. నేటి(సోమవారం) నుంచి ప్రారంభమయ్యే దుర్గామాత ఉత్సవాలలో పాల్గొనాలని పలు గ్రామాల ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలే ధ్యేయంగా పలు శాఖల్లో సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజా పాలనలో పేదలు సంతోషంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు చోటివ్వకూడదని, విపక్షాలు ప్రగతి నిరోధకంగా మారాయని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకునే వారినిప్రజలు క్షమించరన్నారు. మా జీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాడ్గుల విజయ డె యిరీ చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూదిని కొండల్‌రెడ్డి, నాయకులు జగన్, వెంకటయ్య, సురేందర్‌రెడ్డి, రమేశ్‌నాయక్, వి ష్ణు, విజయ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

పందుల షెడ్లతో పరేషాన్

- కంపుతో ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


రాచకాల్వ బఫర్ జోన్‌లో ఏర్పాటు చేసిన షెడ్డు ముందు పందులు

ఆదిభట్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని రాచకాల్వ బఫర్‌జోన్‌లో ఉన్న పందుల షెడ్లతో స్థానిక ప్రజలు, టీసీఎస్‌కు వెళ్లే ఉద్యోగస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పందులను ఊరికి దూరంగా పెంచుకోవాలని నిబంధనలు ఉన్నప్పటికీ పెంపకం దారులు వాటిని పాటించడం లేదు. రోడ్డు పక్కనే దాదాపు నాలుగు పందుల షెడ్లు వెలిశాయి. టీసీఎస్ పరిసర ప్రాంతాల్లో హాస్టళ్లు, హోటళ్లు, చికెన్ షాపులు, విద్యా సంస్థలు ఎక్కువగా ఉండడంతో అక్కడ దొరికే వ్యర్థాలను తీసుకొచ్చి రాచకాల్వ పక్కన ఉన్న పందులకు వేస్తుంటారు. దాంతో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు రాచకాల్వలో వేస్తుండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల షెడ్ల పక్కనే ఓ ప్రైవేటు స్కూల్ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులతో పాటు, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దాంతో స్థానికులు, విద్యార్థులు ఆందళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న పందుల షెడ్డులో ఉన్న పందులు టీసీఎస్‌కు వెళ్లే రోడ్డులో సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మున్సిపల్ కేంద్రానికి దూరంగా షెడ్లు ఏర్పాటు చేయించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుర్వాసనతో వేగలేకపోతున్నాం



పందుల షెడ్ల వల్ల దుర్వాసనతో వేగలేక పోతున్నాం. టీసీఎస్ కు వెళ్లే రోడ్డు సమీపంలోని రాచకాల్వ పక్కన ఉన్న పందుల షెడ్లతో రైతులు, అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన వ్యర్థాలు వేయడంతో పందులు గుంపులుగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదాలు జరుగున్నాయి.

\- జనార్ధన్‌రెడ్డి, రైతు, ఆదిభట్ల

కాలనీ సమస్యలు పరిష్కరించాలి


విలేకరులతో మాట్లాడుతున్న మల్లేశ్

శంషాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడలో గల జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్. మల్లేశ్ డిమాండ్ చేశారు. కొత్వాల్‌గూడ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ అసోసియేషన్ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి మల్లేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కాలనీలో గల రోడ్లలో వర్షాలకు బురద చేరింది. దాంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా, ఈ కాలనీకి రాకపోకలు సాగించడానికి రవాణా సౌకర్యం కూడా లేదని, రెండు ట్రిప్పుల బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. బస్తీవాసులు శంషాబాద్‌కు వెళ్లిరావడానికి ఆటోల్లో వెళ్లాల్సి వస్తుందని, అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాలనీ అసోసియేషన్ నాయకులు జి.నగేష్‌గౌడ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, మొయినొద్దీన్, షేక్ తదితరులున్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- విష సర్పాలతో ప్రజల బెంబేలు

కొందుర్గు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొందుర్గు మండలంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం అప్పట్లో భవనాల నిర్మాణం చేపట్టారు. కాలక్రమేనా అవి నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి.


ఒకవైపు కూలిన ప్రభుత్వ క్వార్టర్స్ భవనం


శిథిలావస్థకు చేరిన భవనం

గతంలో నిర్మించిన భవనంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం కొనసాగాయి. ఆ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు శిథిలావస్థలో ఉన్న భవపం రోజురోజుకూ కూలుతోంది. కాగా, అదే భవనం పక్కన ప్రభుత్వ ఉద్యోగులుండేందుకు క్వార్టర్స్ నిర్మించారు. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. కాగా, ఆ రెండు భవనాల సమీపంలో నూతన మండల పరిషత్ కార్యాలయం, మండల విద్యాశాఖ కార్యాలయం, బీసీ సంక్షేమ వసతి గృహం ఉండడంతో విషసర్పాలు సంచరించే ప్రమాదం ఉందని వాటిని తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రఘుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కేశంపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ రఘును మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదివారం పరామర్శించారు. ఈమేరకు షాద్‌నగర్‌లోని రఘు ఇంటికి వెళ్లి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు.

రతన్‌సింగ్‌కు పలువురి నివాళి



ఆమనగల్లు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధికార ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ తండ్రి రతన్‌సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ జిల్లా నాయకుడు పాలకుర్ల మహేందర్‌గౌడ్ పరామర్శించారు. బాలాజీసింగ్‌ను పరామర్శించి రతన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఆంజనేయులుగౌడ్ తదితరులున్నారు.

ఎంఐఎం మండల, పట్టణాధ్యక్షుడిగా హసనుద్దీన్


హసనుద్దీన్‌తో ఎంఐఎం పార్టీ నాయకులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం మండల, పట్టణ అధ్యక్షుడిగా శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని హైమ్మద్‌నగర్‌కు చెందిన హసనుద్దీన్ ఎన్నికయ్యారు. ఆదివారం మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మండల, పట్టణ అధ్యక్షుడిగా హసనుద్దీన్‌ను ఎన్నుకున్నారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్సీ మీర్జా తెలిపారు. హసన్ మాట్లాడుతూ.. ఎంఐఎం పార్టీ పెద్దలు తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలిపారు. మైనార్టీల హక్కుల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. హసన్‌ను కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. శివరాంపల్లి మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్, మహ్మద్ షరీఫ్, మహ్మద్ తాహెర్, బాబా ఖాన్, మహ్మద్ అమేర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీ

కొత్తూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కర్రోళ్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా వినీత్, కార్యదర్శిగా తరుణ్, కోశాధికారిగా రాహుల్, మీడియా ఇన్‌చార్జీలుగా నిఖిల్, ఉదయ్, శ్రీరాములు, గౌరవాధ్యక్షుడిగా సురేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నందిగామ సుధాకర్, దేశాల జైపాల్, రమేష్, జగన్, సురేందర్, ప్రేమ్‌కుమార్, నర్సింహ, ఇంద్రసేనా, భాస్కర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం


ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద వాడు ఆర్థిక బలపడాలన్నదే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజల సంక్షేమం, అబివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల ను పరిశీలించారు. త్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని లబ్దిదారులకు సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదవారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామికనుగుణంగా ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడత గా 3500 ల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో కల్వకుర్తి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతున్నారు. విపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కల్వకుర్తినియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుంటే కొన్ని స్వార్థ శక్తులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. విపక్షాలు రైతులను తప్పుదోవపట్టించడం తగదన్నారు. రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి , ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి సలుపుతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హీరాసింగ్, తులసీరామ్ నాయక్, నరేశ్, సుదీర్, పంచాయతీ కార్యదర్శి జంగయ్య తదితరులు ఉన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ!

(ఐదో పేజీ తరువాయి)

కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు.

బస్‌షెల్టర్ లేక అవస్థలు

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ నుంచి పరిగి- షాద్‌నగర్ వెళ్లే చౌరస్తాలో బస్‌షెల్టర్ లేదు. ఇక్కడికి చుట్టుపక్క గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు బస్‌ల రాకకోసం గంటల తరబడి రోడుపై నిలబడటానికి అవస్థలు పడుతున్నారు. ఎండ ఎండుతూ, వానకు తడుస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని అనేక మంది విద్యార్థులు షాద్‌నగర్, పరిగి, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్తుంటారు. చౌరస్తాలో బస్‌షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపై నిల్చొని ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

ఈసారీ.. కొందరికే!

(ఐదో పేజీ తరువాయి)

వచ్చాక మహిళా సంఘాలకు చీరలు ఇవ్వడం ఇదే మొదటి సారి. చీరల పంపిణీతో మహిళల గౌరవాన్ని పెంచడంతో పాటు చేనేత రంగానికి చేయుతనిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది.

వివిధ రకాల డిజైన్లలో..

గతానికి భిన్నంగా చీరలను తయారు చేయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో చీరకు సుమారు రూ.500కు పైగా ఖర్చు చేసి మహిళల మనసును దోచేలా పలురకాల డిజైన్లను జోడించారు. బంగారు, వెండి జరి అంచు చీరలు, చెక్స్ డిజైన్లు, ఈ సారి ప్రత్యేకమని అధికారులు పేర్కొన్నారు. ఈనెల 21న ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభం కానుండగా, వీలైనంత త్వరగా చీరలను పంపిణీ చేయాలని బావిస్తున్నారు.


సర్దార్‌నగర్‌లోని గోడౌన్‌కు వచ్చిన లారీ

మహిళా సంఘాల్లో ఉన్నవారికే..

గత ప్రభుత్వం 18 ఏళ్ల నిండిన తెల్లరేషన్ కార్డు కలిగిన యువతులు, మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ చేసింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలోని గ్రామ సమైక్య సంఘాలు, స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలకు మాత్రమే చీరలు అందజేసే విధంగా మండల స్థాయి అధికారులకు బాధ్యత అప్పగించారు.

రెండు కాదు ఒకటే..

గత ప్రభుత్వం హయాంలో చీరల నాణ్యత పరంగా కొంతమంది మహిళలు అసంతృప్తి వ్యక్తం చేసి నిరసన తెలిపిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్వాలిటీపరంగా జాగ్రత్తలు తీసుకుంటుంది. మొదట రెండు చీరలు ఇవ్వాలని భావించినప్పటికీ.. ప్రస్తుతం ఒక చీర మాత్రమే ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా 6.30 మీటర్లు, తొమ్మిది మీటర్ల చీరలు సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లాలోని కందుకూరు, సర్దార్‌నగర్‌లోని గోడౌన్‌లకు చీరలు చేరుకున్నాయి.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గట్టిప్పలపల్లి గ్రామానికి చెందిన ఎండీ మహ్మద్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మహ్మద్ మృతి పట్ల సంతాపం తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి సమకూర్చిన రూ.3వేల ఆర్థిక సాయాన్ని నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించినవారిలో నాయకులు రేణురెడ్డి, డేవిడ్, నరేందర్‌గౌడ్, అంజయ్య, శివకుమార్‌గౌడ్, రాజశేఖర్, చంద్రమౌళి, మశ్చేందర్, సయ్యద్ రఫీక్, వరుణ్ రాజ్, రాహుల్, నవీన్‌గౌడ్, సురేశ్, పవన్, అఫ్సర్, ఖాదర్, తదితరులున్నారు.

జీపీ కార్మికులకు దుస్తుల అందజేత

తలకొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ గ్రామ పంచాయతీ కార్మికులకు దసరా కానుగా దుస్తులు అందజేశారు. హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ మొక్తాల నర్సింహ్ములు గౌడ్ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా పంచాయతీ కార్మికులకు దుస్తులు సమకూర్చి అందజేయడం జరుగుతుంది. ఆదివారం రాంపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి తో కలిసి నర్సింహ్ములు గౌడ్ వాటిని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.


దుస్తులు అందజేస్తున్న నర్సింహులు గౌడ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి


కొండా లక్ష్మణ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన తుది శ్వాస వరకు అవిశ్రాంతంగా పోరాడిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 13వ వర్ధంతిని ఆదివారం ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్‌కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవులను సైతం త్యజించిన గొప్ప మహానాయకుడు బాపూజీ అని కొనియాడారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు ఆయన మారుపేరని కొనియాడారు. ఎంపీడీవో మాధురి, చేనేత సహకారం సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీను, పద్మశాలి సంఘం జిల్లా, మండల నాయకులు అవ్వారి శివలింగం, అప్పం శ్రీను, భీమనపల్లి దుర్గయ్య, ఎంగలి బాలకృష్ణ, శ్రీధర్, పాలాది శ్రీను, ఏలె నిరంజన్, పురుషోత్తం, అప్పి, పాండు, చంద్రమౌళి, వాసుదేవ్, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 317వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నేతలు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. దీక్షలకు మద్దతుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్ లు కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి ని చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు. లేని యెడల ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. దీక్షల్లో నాయకులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.